క్లుప్తంగా

డీఎస్పీ రఘువీర్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ క్రైం: కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా విష్ణు రఘువీర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రఘువీర్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిశారు.

కరపలో ఎస్సై శోభన్‌కుమార్..



కరప: సార్వత్రికలు ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా పసుపులేటి శోభన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెదపూడి ఎస్‌ఐగా పనిచేస్తున్న శోభన్‌కుమార్ కాకినాడ వీఆర్‌కు వెళ్లి, అక్కడ నుంచి కరప ఎస్‌ఐగా బదిలీపై వచ్చి చేరారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న టి.రామకృష్ణ వీఆర్‌కు వెళ్లారు.

హారిక తల్లికి రూ.కోటి పరిహారం చెక్కు అందజేత



హారిక తల్లి అన్నపూర్ణకు చెక్కు అందజేస్తున్న అర్బన్ తహసీల్దార్ జితేంద్ర తదితరులు

కాకినాడ రూరల్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో బుధవారం చోటు చేసుకున్న ఘోర దుర్ఘటలో మృతి చెందిన కాకినాడకు చెందిన కెమికల్ ట్రైనీ ఇంజినీరు చల్లపల్లి హారిక కుటుంబానికి అధికారులు రూ.కోటి పరిహారం చెక్కును అందించారు. ఫార్మా కంపెనీకి చెందిన చెక్కును హారిక తల్లి అన్నపూర్ణ పేరిట రాసి శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటలకు కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర అందజేశారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని బాధితురాలికి తెలియజేశారు. కార్యక్రమంలో హారిక నాన్నమ్మ ఆదిలక్ష్మి, బంధువులు, కాకినాడ అర్బన్ ఆర్‌ఐ రాజు, నర్సీపట్నం డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం



ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ మన్‌మోహన్ యాదవ్ అన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం తూరంగి పగడాలపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వరదలు, సునామీలు, తుపాన్ల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రాథమిక చికిత్స, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సి చర్యలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు, తూరంగి గ్రామ 4, 5 సచివాలయం కార్యదర్శులు, వీఆర్వోలు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు



గంజాయి విక్రేతలను అదుపులోకి తీసుకున్న పోర్టు పోలీసులు

కాకినాడ క్రైం: కాకినాడ బీచ్ రోడ్డులో ఇద్దరు గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీహార్‌కు చెందిన రవీంద్రయాదవ్, రాజేష్‌ఠాగూర్ గంజాయిని చిన్న పొట్లాలుగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో కాకినాడ పోర్టు పీఎస్ సీఐ సునీల్ కుమార్ బృందం దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

పిఠాపురం: వికాస ఆధ్వర్యంలో శనివారం పిఠాపురం ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 40 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని సుమారు 2500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉన్నవారు అర్హులని తెలిపారు. అర్హతలు ఉన్నవారు శనివారం ఉదయం 9 గంటలకు పిఠాపురం ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూలులో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలని ఆయన కోరారు.



మహిళలను గౌరవించడం నేర్పాలి

పురుషులతో పోటీపడి ప్రతి రంగంలో మహిళలు వారితో సమానంగా పనిచేస్తున్నారు. మహిళలు పనిచేసే చోట తగిన భద్రత కల్పించాల్సిన ఆవశ్యకతను కోల్‌కతా వైద్యురాలి ఘటన సూచిస్తోంది. ఇటువంటి దారుణాలు జరగకుండా ఉండాలంటే కుటుంబంలోని తల్లి, చెల్లిని గౌరవించినట్లే బయట మహిళలను కూడా గౌరవించేలా తమ పిల్లలకు తల్లిదండ్రులు బాల్యం నుంచే నేర్పాలి. స్త్రీ, పురుషులు పరస్పరం గౌరవించుకున్నపుడే మహిళలపట్ల అత్యాచారాలు, హత్యలు ఆగుతాయి.

– డాక్టర్ ఎంకే సౌజన్య, వైద్యాధికారి, వేళంగి పీహెచ్‌సీ, కరప మండలం



మహిళా సిబ్బందికి రక్షణ ఉండాలి



ఆస్పత్రుల్లోని డాక్టర్లు, మహిళా సిబ్బందికి రక్షణ లేదు. మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా శిక్షించాలి. ప్రతి ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. దీనికి తోడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో 50 శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. వీరు రాత్రి సమయంలో కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహిళా సిబ్బందికి రక్షణ లేక పోతే విధులు నిర్వహించడం కష్టంగా మారుతుంది.

– డాక్టరు నూనె మాధురి, సామర్లకోట

ముస్తాబవుతున్న గణనాథులు

- ప్రతిమల తయారీలో రాజస్థానీలు
- వివిధ ఆకృతులు, రంగులతో సిద్ధం
- ఇళ్లలో పూజలకు మట్టివి.. పందిళ్లలోకి పీఓపీ ప్రతిమలకే ప్రాధాన్యం

కాకినాడ సిటీ: చవితి ఉత్సవాలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. గతంలో ఊరిలో రెండు, మూడు ప్రాంతాల్లోనే నిర్వహించే గణపతి నవరాత్రి మహోత్సవాలు నేడు ప్రతి పేట, వీధిలో నిర్వహిస్తున్నారు. ఒక మోస్తరు నుంచి భారీ విగ్రహాల ఏర్పాటుకు సిద్ధమౌతున్నారు. కాకినాడ నగరంలోని అనేక సంవత్సరాలుగా తూరంగి, కొవ్వూరు, చీడిగ, ఇంద్రపాలెం, గంగనాపల్లి, కొవ్వాడ, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఉప్పలంక, కరప, సర్పవరం, నడకుదురు, వేళంగి తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు.

పీఓపీతో భారీ ప్రతిమల తయారీ

నగరంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలనే చైతన్యం ఎక్కువైనా ఆకర్షణీయమైన విగ్రహాలు కావాలంటే పీఓపీతో చేసిన ప్రతిమలే బాగుంటాయని ఉత్సవ కమిటీలు భావిస్తున్నారు. పైగా వీటి ధర కూడా మట్టి ప్రతిమల కంటే తక్కువని వారు చెప్తున్నారు.

రాజస్థానీలదే అందెవేసిన చేయి

పీఓపీ ప్రతిమల తయారీలో రాజస్థానీలు సిద్ధహస్తులు. ప్రతి పట్టణ, నగర ప్రాంతాల్లో వీరు ఏళ్ల తరబడి ఇక్కడే ఉండి ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఈ మేరకు కాకినాడ నగరం, కాకినాడ రూరల్ ప్రాంతాల్లోనే కొందరు రాజస్థానీలు వలస వచ్చి 35 ఏళ్లుగా నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరపడిపోయారు. దాదాపు 60 కుటుంబాల వారు ఇదే పనిలో ఉంటున్నారు. గణపతి నవరాత్రి సమయంలో గణపతి ప్రతిమలు, ఇతర సమయాల్లో శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, ఆంజనేయస్వామి వంటి దేవుళ్ల ప్రతిమలతో పాటు ఫ్లవర్‌వాజ్‌లు, ఇతరత్రా గృహాలంకరణ వస్తువులు తయారు చేస్తూ వారు జీవనం సాగిస్తున్నారు.

ఆకర్షణీయంగా..

రాజస్థానీలు రూపొందించే ప్రతిమలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. మంచి రంగుల కాంబినేషన్ వినియోగించడంతో పాటు ఏటా నూతన ఆలోచనలతో విభిన్న ఆకృతుల్లో విగ్రహాలు తయారు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటి విక్రయాలు కూడా బాగానే ఉంటాయి. ఈ ఏడాది ఒక్కొక్క ప్రాంతంలో మొత్తం మీద 800 నుంచి 1000 ప్రతిమలు అమ్ముడుపోతాయని ఆశిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు.



అమ్మకాలకు సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు



వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతున్న యువకుడు

సబ్సిడీపై రుణాలు అందించాలి



15 ఏళ్లుగా ఇక్కడే ప్రతిమలు తయారు చేస్తున్నాం. చిన్నపెద్దా పనులు చేస్తూ ఇక్కడే ఉండిపోతున్నాం. మాకు ఆధార్, ఓటు గుర్తింపు కార్డులు ఇక్కడే ఉన్నాయి. అయినా రేషన్‌కార్డులు ఇవ్వడం లేదు. దీని వల్ల ప్రభుత్వం నుంచి ఏ సంక్షేమం పొందలేకపోతున్నాం. రేషన్‌కార్డులు ఇస్తే బియ్యం తీసుకోవడం వల్ల కుటుంబానికి కొంత ఊతం అవుతుంది. ఈ ఏడాది ప్రతిమల తయారీకి రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టాం. 5 అడుగుల ప్రతిమ రూ.12 వేలు నుంచి రూ.15 వేలు, 10 అడుగుల ప్రతిమ రూ. 25 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఉంటుంది. అన్నీ సజావుగా జరిగితే నష్టం లేకుండా ఉంటుంది. సాధారణ రోజుల్లో చిన్నచిన్న ప్రతిమ విక్రయంతో కేవలం కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం వస్తుంది. మాకు ప్రతిమలు తయారు చేయడానికి సబ్సిడీపై రుణాలు అందిస్తే కొంత చేదోడుగా ఉంటుంది.

– శ్రీరామ్, విగ్రహాల తయారీదారుడు, రాజస్థానీయుడు

సమస్యలు లేకుండా ఇసుక విధానం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్‌మీనా అమరావతి నుంచి ఉచిత ఇసుక విధానంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జేసీ రాహుల్ మీనాతో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్షించి ఇసుక లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు.

5,642 మీటర్ల పర్వతారోహణ

ఘనత సాధించిన కాకినాడ మహిళ



పర్వతారోహణ చేసిన కోనేరు అనిత

కాకినాడ: కాకినాడకు చెందిన కోనేరు అనిత అత్యంత ఎత్తైన పర్వతారోహణ చేసి ప్రశంసలు అందుకున్నారు. కాకినాడకు చెందిన ఆమె రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురితో కలిసి రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రూస్ పర్వతాన్ని ఐదు రోజుల వ్యవధిలో అధిరోహించి ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 19వ తేదీన పర్వతారోహణ చేసి శుక్రవారం కాకినాడ చేరుకున్న ఆమె 5,642 మీటర్ల ఎత్తైన పర్వతారోహణ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

ఎన్‌టీఆర్ వైద్య సేవలపై అలసత్వం వద్దు

- కలెక్టర్ షణ్మోహన్
- వివిధ శాఖలపై సమీక్ష

కాకినాడ సిటీ: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశాన్ని శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యసేవల అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. లేకుంటే సంబంధిత ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పథకం కింద రోగుల నుంచి పేషెంట్ల వద్ద డబ్బులు వసూలు చేసిన రెండు ఆస్పత్రులకు జరిమానా విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

31వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించి కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత అధికారులతో సమీక్షించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి చేయండి

జిల్లాలోని 72 పీఏసీఎస్‌లలో గడువులోపు కంప్యూటరీకరణ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సహకారశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఆయా సమావేశాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

- జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్
- ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

కాకినాడ సిటీ: ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినిల్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన భారతి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జగన్నాథపురం బీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలపై అవగాహన కల్పించారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్షం నుంచి 2023 జూలై 14వ తేదీన ప్రయోగించిన చంద్రయాన్–3లోని ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో 2023 ఆగస్టు 23న సురక్షితంగా దిగిన సందర్భంగా ఆ తేదీని ఏటా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారన్నారు. బాల వేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ ఆకాశ వీధుల్లో ఇస్రో జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. చంద్రయాన్–3పై చక్కటి విజయగీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్‌బి సరోజినిదేవి, కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయుని వి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రాకెట్‌ల నమూనాలు తయారు చేయగా, క్విజ్‌పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులు రూపొందించిన వివిధ రాకెట్ల నమూనాలతో ఉపాధ్యాయులు

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



అష్టలక్ష్మి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్న మహిళలు



లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠంలో శ్రావణ మాసం సందర్భంగా కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ప్రసూన మహిళలకు చీర, రవిక, పూజా సామాగ్రి అందించారు. క్లబ్ జోనల్ చైర్మన్ చిట్నీడి నాగమణి, క్లబ్ కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి ఆలయంలో సుమారు 500 మంది సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహించారు.

ఆయిల్ పామ్ లాభదాయకం

- రైతులకు అవగాహన కల్పించిన ఎమ్మెల్యే, ఉద్యాన అధికారులు
- వరిలో అంతర పంటగా సాగుచేయాలని పిలుపు

కరప: వరిపంటతో పాటు ఆయిల్ పామ్ సాగుచేస్తే లాభాలు ఆర్జించవచ్చని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మండలం కొరిపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకప్పుడు మెట్ట ప్రాంతానికే పరిమితమైన ఈ పంట డెల్టాలో కూడా సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. నాలుగేళ్ల పాటు మొక్కలు నాటి పెంచడానికి రూ.71 వేలు సబ్సిడీ వస్తుందని, ఆతర్వాత ఎకరానికి ఏటా రూ.లక్ష వరకు లాభం పొందవచ్చన్నారు. ఉద్యాన పంటలకు ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానించామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రేషన్‌బియ్యంలో పోషక విలువలు ఉన్నాయని, వాటిని అమ్ముకోకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. కొబ్బరి పంటకు సమాంతరంగా ఉంటుందని, దానితో పోల్చుకుంటే ఆయిల్‌పామ్ తక్కువఖర్చుతో నాలుగేళ్లు పెంచితే 25 ఏళ్ల పాటు పంటను పొందవచ్చన్నారు. ఉచితంగా మొక్కలు సరఫరా చేసి , పెంపకానికి రాయితీపై ఎరువులు సరఫరా చేస్తామన్నారు. ఈ ఏడాది కొత్తగా కరప, కాజులూరు మండలాల్లో వంద హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుచేయాలన్న లక్ష్యంతో రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. రైతులు ముందుకు వస్తే ఆయిల్ పామ్ సాగుపై పూర్తి అవగాహన కల్పించడమే కాకుండా ఉద్యాన శాఖ సిబ్బంది దగ్గరుండి అన్ని పనులు చేయిస్తారన్నారు. సాగు పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలో జరుగుతుందని, ఈ సాగు చేపట్టి, లాభాలు ఆర్జించాలని డీహెచ్ఓ మల్లిఖార్జునరావు రైతులను కోరారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను ఎమ్మెల్యే నానాజీ అందజేశారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జీవీ ప్రసాద్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామాలే ప్రభుత్వ ధ్యేయం

సమస్యలు పరిష్కరించి స్వర్ణ గ్రామాల రూపకల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. మండలం కొంగోడులో శుక్రవారం సర్పంచ్ నక్కా బాబులు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రజలు చెప్పిన సమస్యలను విని త్వరలో పరిష్కరిస్తానన్నారు. అనంతరం గురజనాపల్లిలో గ్రామసభలో పాల్గొని సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఏపీఓ జీవీ రమణకుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ, అధికారులు

టంగుటూరికి ఘనంగా నివాళి



కరపలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది



టంగుటూరికి నివాళులర్పిస్తున్న జాయింట్ కమిషనర్ సుమతి, డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్ తదితరులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలోని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జాయింట్ కమిషనర్ జి.సుమతి, డిప్యూటీ కమిషనర్ సత్యప్రకాష్, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాజా, సత్యనారాయణ తదితరులు పూల మాలలు వేసి నివాలర్పించారు.

కరపలో..

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది వీవీఎస్ వీరేష్, టి.సురేష్, జీవీ చినరాయుడు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు, వ్యవస్థాపకతతో ఉపాధి కల్పన

- ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ): ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పనలోని సవాళ్లను అధిగమించవచ్చునని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చెప్పారు. జేఎన్‌టీయూకే విద్యార్థులకు ఉపాధి కల్పన వ్యవస్థాపకతను పెంపొందించేందుకు హైదరాబాద్‌లోని వ్యాపార ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్ మధ్యవర్తి అయిన టిచీ హబ్, టిచీ వర్క్స్‌ను వీసీ సందర్శించి టిచీ హబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి ఇతర ప్రతినిధులతో సమీక్షించారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ జేఎన్‌టీయూకే పరిధిలోని అనుబంధ కళాశాలల విద్యార్థులు వ్యవస్థాపకత, ఆవిష్కరణలను సులభతరం చేయడంలో కీలకపాత్ర పోషించాలనే లక్ష్యంతో టిచీ హబ్‌ను సందర్శించినట్టు చెప్పారు. స్టార్టప్‌లు, ఆవిష్కరణలను పెంపొందించడంలో టిచీ హబ్ కార్యాచరణ నమూనా, విజయ కారకాలను అర్థం చేసుకోవడంతో పాటు వనరులు, జ్ఞాన సముపార్జనకు జేఎన్‌టీయూకే, టిచీ హబ్ సహకరించుకునేలా చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దేందుకు మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయడంతో పాటు అనుబంధ కళాశాలల్లో ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీసీ మురళీకృష్ణ వెంట టిచీహబ్ ప్రతినిధులు సీహెచ్ సాయి అభినయ్, జి.రవి, డాక్టర్ సీహెచ్ యువరాజ్, టి.శిరీష, జి.స్వరూప ఉన్నారు.

నేటి నుంచి నృత్య నీరాజనం

బోట్‌క్లబ్: శాస్త్రీయ నృత్యకళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో సూర్యకళామందిరంలో వెయ్యిమంది నృత్య కళాకారులచే నృత్య నీరాజనం నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రతినిధులు ఓవీఎస్ వరప్రసాద్, ఆనెం ప్రసాద్, లోకేష్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్విరామంగా జరిగే కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 53 నృత్య సంస్థలకు చెందిన విద్యార్థులు, కళాకారులతో పాటు, నాట్య గురువులు పాల్గొంటారన్నారు.

26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ది గోదావరి కళాకౌముది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు బాజిబోయిన వెంకటేష్‌నాయుడు తెలిపారు. సూర్యకళా మందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకూ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నారుల పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని, విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని ఆయన తెలిపారు.